క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి శనివారం ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ బాధితులకు అప్పగించారు. నామానగర్ గ్రామానికి చెందిన సుధాకర్, కల్యాణ్‌లు సెల్‌ఫోన్‌లను పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్‌ఫోన్‌లను ట్రేస్ చేసి బాధితులకు అప్పగించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నయీం పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



రోడ్డును పరిశీలిస్తున్న మోతీరాం

కెరమెరి: మండలంలోని రాంపూర్ గ్రామానికి సమీపంలో ఉన్న కల్వర్టుపై రాళ్లు తేలి నడిచేందుకు యోగ్యంగా లేకుండా పోయిందని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపీపీ మోతీరాం అన్నారు. రోడ్డును పరిశీలించి ఆయన మాట్లాడారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు.

ఐకేపీ కార్యాలయంలో మద్యం పార్టీ

భీమిని: మండల కేంద్రంలోని భరతమాత మండల సమాఖ్య(ఐకేపీ) కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఐకేపీ ఏపీఎం ప్రకాష్‌తో కలిసి వీఏఓలు కొందరు మందు పార్టీ చేసుకుంటున్నారని సమాచారం తెలియడంతో మండల కాంగ్రెస్ నాయకులు అక్కడికి వెళ్లారు. వెంటనే స్థానిక పోలీసులకు శుక్రవారం రాత్రి 9గంటలకు సమాచారం అందించారు. దీంతో కార్యాలయం ముందు కాంగ్రెస్ నాయకులకు, మద్యం పార్టీలో ఉన్న ఐకేపీ సిబ్బందికి వాగ్వాదం చోటు చేసుకుంది. తాము వచ్చే సరికి ఐకేపీ ఏపీఎం, వీఏఓలు మందు సీసాలను కార్యాలయం కిటికీల నుంచి బయటకు విసిరేసినట్లు, మద్యం సీసాలను, తినుబండారాలను సైతం అక్కడికి వచ్చిన పోలీసులకు కాంగ్రెస్ నాయులు చూపించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఫోన్ ద్వారా తాండూర్ సీఐ కుమారస్వామి, స్థానిక ఎస్సై విజయ్‌కుమార్‌లకు సమాచారం అందించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా కాంగ్రెస్ నాయకులు ఇచ్చి ఫిర్యాదుపై విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.



రహదారికి ఇరువైపులా ఉన్న వెదురు చెట్ల మధ్య ప్రయాణం



వెదురు చెట్లతో సహజ స్వాగత తోరణం



అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

పరుచుకున్న పచ్చదనం

కాగజ్‌నగర్ డివిజన్ కేంద్రం నుంచి సిర్పూర్ మండల కేంద్రం వరకు ప్రయాణించే దారిలో దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. వర్షాలతో అడవులు పచ్చదనంతో నిండిపోగా ఈ మార్గంలో ప్రయాణం ఆహ్లాదకరంగా మారింది. వెంపల్లి నుంచి పెద్దబండ వరకు రహదారికి ఇరువైపులా వెదురు వనాలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోంది. అటవీశాఖ కవ్వాల్ టైగర్ రిజర్వ్ వైల్డ్‌లైఫ్ కారిడార్ పేరిట అడవిలో ఆకర్షణీయంగా బోర్డులు ఏర్పాటు చేసింది. అటవీ అందాలకు ముగ్ధులైన ప్రజలు ఫొటోలు తీసుకుంటూ జ్ఞాపకాలు పదిల పర్చుకుంటున్నారు.

– చింతలమానెపల్లి



అటవీ ప్రాంతంలో కవ్వాల్ రిజర్వ్ వైల్డ్ లైఫ్ కారిడార్ బోర్డు



రహదారి పక్కన వన్యప్రాణులను సూచించే బోర్డు

అస్తవ్యస్తంగా పారిశుధ్యం!

- దోమలకు ఆవాసాలుగా నాలాలు
- మూలనపడ్డ ఫాగింగ్ యంత్రాలు
- సులభ్ కాంప్లెక్స్‌లు లేక అన్నీ ఆరుబయటే..
- అవస్థలు పడుతున్న ప్రజలు



ఖమాన గ్రామంలో..



వాంకిడిలో అధ్వానంగా మురికి కాలువ

వాంకిడి: మండల కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాలువల నిర్వహణ సరిగా లేకపోవడంతో నాలాల్లో మురుగు నీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని అనేక వీధుల్లో డ్రెయినేజీ సమస్య ఉంది. మండలం గుండా జాతీయ రహదారి నిర్మాణం అనంతరం పరిస్థితి మరీ దారుణంగా మారింది. రహదారి నిర్మాణంతో పాటు సైడ్ డ్రెయిన్‌ల ఎత్తు ఎక్కువగా ఉండడంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దశాబ్దాల క్రితం నిర్మించిన నాలాల్లోని మురుగు నీరు హైవే డ్రెయిన్‌ల నుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి..

గతంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ముందు ఉన్న రోడ్డుకు అనుగుణంగా మురికి కాలువలు ఉండేవి. దీంతో వీధుల్లోని మురుగు నీరంతా ఊరి అవతలికి వెళ్లేది. కానీ నూతనంగా నిర్మించిన రహదారి ఎత్తు పెరగడంతో దశాబ్దాల క్రితం నిర్మించిన నాలాలు లోతట్టు ప్రాంతంలోకి వెళ్లాయి. కాగా మండల కేంద్రంలోని కొన్ని ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా నిర్మించాల్సిన సైడ్ డ్రెయిన్‌లు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆ ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు నీటి నిల్వతో దోమల వ్యాప్తి అధికమవుతుంది.

సులభ్ కాంప్లెక్స్‌లు లేక..

మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్‌లు లేక ప్రతీరోజు మండల కేంద్రానికి వచ్చే వేలాది మంది ప్రజలు ఒంటికి, రెంటికి వెళ్లాల్సి వస్తే ఆరుబయటే కానిస్తున్నారు. మండల పరిధిలో వందకు పైగా గ్రామాలు ఉండగా నిత్యం నిత్యవసరాల కొనుగోలుకు, కార్యాలయాల్లో పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారికి మల, మూత్ర విసర్జన చేసేందుకు మండల కేంద్రంలో వసతులు కల్పించకపోవడంతో ఎక్కడబడితే అక్కడే కానిచ్చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ బాత్రూంలు లేవు. నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయంలో తప్ప ఏ ఒక్క కార్యాలయంలో ప్రజలు ఉపయోగించేందుకు మూత్రశాలలు లేవు. కార్యాలయాల గోడలు సైతం మల, మూత్ర విసర్జనతో అధ్వానంగా దర్శనమిస్తుంటాయి. వాగుకు వెళ్లే దారిలో ఉన్న ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణ మూత్ర విసర్జన ప్రాంతంగా మారిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

దోమల నివారణ చర్యలు లేవు..

దోమల వ్యాప్తిని నివారించేందుకు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలు రూ.60వేల నుంచి రూ.70 వేలు వెచ్చించి ఫాగింగ్ మిషనరీ కొనుగోలు చేశారు. గతేడాది వరకు అడపాదడపా వీధుల్లో ఫాగింగ్ చేయగా ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై నెల కావస్తున్నా దోమల నివారణకు చర్యలు కానరావడం లేదు. గ్రామాల్లో చెత్త తొలగించడం, మురికి కాలువలు శుభ్రం చేయడం, పాగ పెట్టడం వంటి పనులు నామమాత్రంగా సాగుతున్నాయి. జీపీలకు నిధులు లేక పనులు చేపట్టడం భారంగా మారిందని తెలుస్తోంది.

చర్యలు చేపట్టడం లేదు..



మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. అస్తవ్యస్తంగా ఉన్న మురికి కాలువల కారణంగా దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి వరద, మురుగు నీరు ఇళ్లలోకి చేరి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదు.

– ఎలగతి సుచిత్, వాంకిడి

సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి



మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్తే మల, మూత్ర విసర్జనకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మహిళల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆరుబయటే అన్నీ కానిస్తుండటంతో విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించాలి.

– జాడి తిరుపతి, ఖమాన

‘ప్రజా కృతజ్ఞత సభ’ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన: కేంద్రంలో బీజేపీకి మూడోసారి అధికారం కట్టబెట్టడంతో పాటు ఆదిలాబాద్ ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థిని గెలిపించినందున ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో గోలేటిలో నిర్వహించే ప్రజలకు కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం అభివృద్ధి కోసం నరేంద్రమోడీని మూడోసారి ప్రధానిగా, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా గోడం నగేశ్‌ను గెలిపించిన జిల్లా ప్రజలకు బీజేపీ ఎప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. జిల్లా, మండల ప్రజలకు కృతజ్ఞత తెలుపుతూ గోలేటిలోని బస్టాండ్ వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రజా కృతజ్ఞత సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ గోడం నగేశ్ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలో ప్రజలు, యువత, కుల సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై గోలేటి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఆరు నెలల కింద 6 గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీజేపీ అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ ఆరోపించారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అనతికాలంలోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి జగన్నాథ ఓదెలు పాల్గొన్నారు.

నేడు విజయోత్సవ సభ

ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఒకడ్డపల్లి గార్డెన్‌లో నిర్వహించే విజయోత్సవ సభకు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ హాజరుకానున్నట్లు నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకొని మొదట జన్కాపూర్ శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అక్కడి నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బైక్‌ర్యాలీతో ఒడ్డెపల్లి ఫంక్షన్‌హాల్‌కు చేరుకోనున్నట్లు పేర్కొన్నారు. విజయోత్సవ సభలో ఎంపీ నగేశ్‌ను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. విజయోత్సవ సభకు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై రాజేశ్వర్

ఆసిఫాబాద్‌అర్బన్: రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. శనివారం పట్టణంలోని వివేకానంద చౌక్ వద్ద సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలని, నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలకు పెండింగ్ చలాన్లు లేకుండా చూసుకోవాలని, పోలీసుస్టేషన్ పరిధిలోని జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో సుమారు 30 మందికి పైగా వాహన చోదకులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దత్తు, కానిస్టేబుల్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకేది రక్షణ..?

- ఏటా పెరుగుతున్న ఘటనలు
- చట్టాలపై అవగాహన కరువు



కౌటాల: మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా వారికి మాత్రం రక్షణ లేకుండా పోతోంది. పసిమొగ్గలపై మృగాళ్ల పైశాచికత్వాలు రోజురోజుకు పేట్రేగిపోతున్నాయి. ఇందుకు పెరుగుతున్న టెక్నాలజీ ఒకింత కారణం కాగా.. పిల్లల పెంపకం విషయంలో తల్లిదండ్రులు బాధ్యతారాహిత్యంగా ఉండకూడదని పలువురు పేర్కొంటున్నారు. చట్టాలపై భయం ఉంటేనే వీటిని అరికట్టవచ్చని చెబుతున్నారు. ఇటీవల జిల్లాలోని దహెగాం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై పెద్దపల్లి జిల్లాలో ఓ కామాంధుడు లైంగిక దాడి చేసి హతమార్చిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీశయంగా మారింది.

అవగాహన అవసరం..

జిల్లాలో మైనర్లపై రోజురోజుకు పెరుగుతున్న లైంగిక దాడులు ఒకింత ఆందోళనకు గురిచేస్తుండగా.. పోక్సోచట్టం నిందితులను కటకటాలు లెక్కించేలా చేస్తోంది. ఈ కఠిన చట్టంపై మరింత అవగాహన పెంచాల్సి ఉండగా.. బాలికల రక్షణకు సర్కారు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా వాసులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని, సమాజంలో జరుగుతున్న దారుణ ఘటనలపై, ఇబ్బంది పరిస్థితుల్లో ఎలా కాపాడుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో జరిగిన పలు ఘటనలు

- గతేడాది జనవరి 13వ తేదీన జిల్లాలోని కౌటాల మండలం వీర్దండి గ్రామానికి చెందిన బాలిక(9) పై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇంటి వద్ద ఒంటరిగా ఆడుకుంటున్న బాలికపై ఇంటి సమీపంలోని ఓ వ్యక్తి దారుణానికి పాల్పడడంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- గతేడాది ఏప్రిల్ 18న దహెగాం మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన బాలిక (16) గ్రామ సమీపంలోని ఒర్రె వద్దకు నీళ్లు తేవడానికి వెళ్లింది. బాలికను ఒంటరిగా గమనించిన అదే గ్రామానికి చెందిన అనిల్ పుల్లార్‌వార్ అనే వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశారు.
- గతేడాది మే 8వ తేదీన జిల్లాలోని కాగజ్‌నగర్ మండలంలోని ఓ గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. ఏడేళ్ల బాలికపై 54 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు.
- గతేడాది మే నెల 13న కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్‌కు చెందిన ఓ బాలిక (14) పై లైంగిక దాడికి యత్నించిన ఓ యువకుడిపై కేసు నమోదు చేశారు.
- సిర్పూర్(టి) మండలంలోని ఓ గ్రామంలో ఓ యువతిని ఓ కామాంధుడు ప్రేమ పేరుతో వేధించాడు. అప్పటికే అతడికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉండటంతో యువతి అతడి ప్రేమను అంగీకరించలేదు. దీంతో గతేడాది సెప్టెంబర్ 17న యువతి ఇంట్లోకి చొరబడి బలవంతంగా ఆమెకు పురుగుల మందు తాగించాడు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.
- ఈ ఏడాది జూన్ 30న సిర్పూర్(టి) మండలంలోని ఓ గ్రామంలో మూడేళ్ల చిన్నారి స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.
- ఆసిఫాబాద్ పట్టణంలోని కంచుకోట ప్రాంతానికి చెందిన ఓ ఒంటరి మహిళ(25) ఈ ఏడాది ఫిబ్రవరి 17న రాత్రి ఇంటికెళ్తుండగా మద్యం తాగి ఉన్న నలుగురు వ్యక్తులు ఆమెపై లైంగిక దాడికి యత్నించారు. బాధితురాలు కేకలు వేయడంతో మందుబాబులు అక్కడి నుంచి పరారయ్యారు.

పిల్లలపై దృష్టి పెట్టాలి

ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో పిల్లలు పక్కదారి పడుతున్నారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాడ్ టచ్, గుడ్ టచ్ వంటి విషయాల్లో పిల్లలకు అవగాహన కల్పించాలి. పిల్లలను ఒంటరిగా ఉంచవద్దు. బాలిక రక్షణ చట్టాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– కరుణాకర్, డీఎస్పీ, కాగజ్‌నగర్

మహేశ్‌గౌడ్‌కు ఉత్తమ సామాజిక సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న రంగు మహేశ్‌గౌడ్

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన రంగు మహేశ్‌గౌడ్‌కు జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉత్తమ సామాజిక సేవా అవార్డు లభించింది. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో నిర్వహించిన జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి 8వ వార్షికోత్సవం సందర్భంగా రంగు మహేశ్‌కు అవార్డు అందజేశారు. కరోనా సమయం నుంచి ఇప్పటి వరకు పేదలకు అందించిన సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు అందించా రు. మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్‌కే జైన్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు

దహెగాం: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగు వంతెన అప్రోచ్‌రోడ్డు మట్టి వర్షాలకు కొట్టుకుపోతుండడంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. భారీ వాహనాలు వెళ్లడానికి రోడ్డు అనువుగా లేదని, కొత్తవారు వంతెనపై నుంచి వస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నిక



ఎంపిక పత్రాలు అందిస్తున్న ఎన్నికల అధికారి

చెన్నూర్: పట్టణంలోని భవన నిర్మాణ తాపి కార్మిక భవన్‌లో శనివారం లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు నరేష్ అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా నెన్నెల రాజన్న, ఉపాధ్యక్షుడిగా బైరం చిన్నపోశం, కార్యదర్శిగా కుడికాల సంతోష్, డైరెక్టర్స్‌గా చెడె అశోక్, నెన్నెల సత్యం, బొడ్డు రాజు, డేగల రాజశేఖర్, చెన్న శివకుమార్, పోగుల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వారికి ఎన్నికల అధికారి ఎంపిక పత్రాలు అందించి అభినందించారు.